క్లుప్తంగా

ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు



జగ్గయ్యపేట అర్బన్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నియోజకవర్గ ప్రజలకు శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని, వారి జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు. అలాగే ఆ శివుని కరుణా కటాక్షాలు, ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మించాలన్నదే లక్ష్యం

నందిగామ: పేదలందరికీ ఇళ్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని అనాసాగరం లేఅవుట్ వద్ద శనివారం లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకోవడంతో పాటు, లబ్ధిదారులకున్న సమస్యలు, అనుమానాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ఈ తరుణంలో ప్రతి లేఅవుట్ లోను నిర్వాసితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: వీఆర్వోలు ఆయా గ్రామాలలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఆశయ్య పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు రెవెన్యూ పరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రై డే కార్యక్రమం పరిశీలన

నందిగామ: పట్టణంలోని 12వ వార్డు పరిధిలో శుక్రవారం జరిగిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని కమిషనర్ డాక్టర్ జయరాం పరిశీలించారు. వార్డు పరిధిలోని ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

నందిగామ: పట్టణంలోని నాల్గవ సచివాలయాన్ని శుక్రవారం కమిషనర్ డాక్టర్ జయరాం తనిఖీ చేశారు. సచివాలయంలోని సిబ్బంది పనితీరు, తదితర అంశాలపై సచివాలయానికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సచివాలయంలోని రికార్డులు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు.

కూడలి తిరునాళ్ల ప్రారంభం

నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించే కూడలి తిరునాళ్ల శుక్రవారం ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా స్వామిని పెండ్లి కుమారుడిగా అలంకరించడంతో పాటు స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పలు ఆటోలకు ఫైన్

నందిగామ: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న పలు ఆటోలకు శుక్రవారం నందిగామ పోలీసులు ఫైన్ విధించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోలలో పరిమితికి మించి ఎక్కించుకొని వస్తున్న ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు ఎస్‌హెచ్ఓ సతీష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అదేవిధంగా పదుల సంఖ్యలో ప్రయాణికులను చేరవేస్తున్న ఆటోలకు ఫైన్ విధించారు.

నేడు శివపార్వతుల కల్యాణం

పెనుగంచిప్రోలు: గ్రామంలోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి 10.30 గంటలకు శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులతో పాటు, శ్రీఅయ్యప్ప సేవా సమితి సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణానికి ముందు హైదరాబాద్‌కు చెందిన కోరుకొండ రోహిణిచే కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాలి

నందిగామ: వాహన చోదకులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఏసీపీ నాగేశ్వరరెడ్డి సూచించారు. పట్టణ సమీపంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఎస్‌హెచ్ఓ సతీష్ ఉన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు



ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలు



విద్యుత్ దీపాలతో అలంకరించిన భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయం



శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం(పెద్ద శివాలయం)



విద్యుత్ దీపకాంతులతో అనిగండ్లపాడులోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం



కోటి లింగాల క్షేత్రంలో ఏర్పాటు చేసిన క్యూ

పెనుగంచిప్రోలు: మహాశివరాత్రిని పురస్కరించుకొని గ్రామాల్లో శివాలయాలను సిద్ధం చేశారు. ఆలయాలకు రంగులు వేయించి విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. శనివారం జరిగే శివపార్వతుల కల్యాణానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

18వ శతాబ్దంలో నిర్మించిన శివాలయం

జగ్గయ్యపేట అర్బన్ : ఆలయాల కోటగా విలసిల్లుతున్న పేట పట్టణానికి శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం (పెద్ద శివాలయం) మకుటాయమానంగా ప్రసిద్ధి కెక్కింది. దక్షిణ భారత దేశంలోనే రెండువందల ఏళ్లక్రితమే 108 ఆలయాలతో ప్రసిద్ధిగాంచిన జగ్గయ్యపేటలో ప్రాచీన గుళ్లు, గోపురాలు, ఆలయాలు, మందిరాలు మనకు అనేకం కనిపిస్తాయి. సుమారు వేయి సంవత్సరాల క్రితం నాటి ఆలయాలు మొదలుకొని ఏడాది క్రితం వరకు రూపు దిద్దుకున్న ఆలయాల వరకు అన్నీ ఏదో ఒక విశిష్టతను సంతరించుకునే ఉన్నాయి. 17వ శతాబ్దంలో పేట మండలంలోని ముక్త్యాల కేంద్రంగా పరిపాలించిన ప్రభువు రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు పేటకు విశిష్ట స్థానాన్ని ఇచ్చాడు. ఆయన పాలనలో ప్రజా సంక్షేమం కోసం దుష్టులైన చెంచులను నిర్దాక్షిణ్యంగా సంహరించిన ఆయన పాప పరిహారం కోసం చంద్రమౌళీశ్వర-చెన్నకేశ్వరస్వామి ఆలయాలను నిర్మించాడు. 18వ శతాబ్దంలో స్వయంగా నిర్మించిన ఆయన హిందూ మతంలో శివ-కేశవ భేదం లేదన్న సత్యానికి ప్రతీకగా ఆయన ఈ రెండు ఆలయాలను నిర్మించినట్లు పూర్వీకులు చెబుతారు. అప్పటి నుంచి దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతున్న ఈ ఆలయంలో అనేక యజ్ఞయాగాది క్రతువులు, మూడు పర్యాయాలు కోటి బిల్వార్చనలు, ప్రతి కార్తీకమాసంలో అనేక బిల్వార్చనలు, శరన్నవరాత్రులు, ప్రతి మాస శివరాత్రి రోజున అన్నాభిషేకం, ప్రతి సంవత్సరం కార్తీక బహుళ విదియ రోజున స్వామి కల్యాణోత్సవాలు జరుగుతూ భక్తుల కొంగు బంగారమై స్వామి భక్తులను అనుగ్రహించుచున్నారు.



నది ఒడ్డున ఏర్పాటు చేసిన జల్లు స్నానాలు

పవిత్ర స్నానాల ఏర్పాట్లు పూర్తి

ముక్త్యాల(జగ్గయ్యపేట): మహా శివరాత్రికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏపీ, తెలంగాణా నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానుండటంతో భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. ముఖ్యంగా కృష్ణానదిలో పుణ్య స్నానాలచరించేందుకు అధిక సంఖ్యలో భక్తులు రానున్నారు. ముక్తేశ్వర స్వామి కల్యాణం తిలకించనున్నారు. పుణ్యసాన్నాలకు లక్షకు పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం ప్రత్యేక ఘాట్‌ల వద్ద జల్లు స్నానాలతో పాటు పడవలు కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ అధికారులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఎండవేడిని తట్టుకునేందుకు అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

పులిచింతల నుంచి 4,200 క్యూసెక్కుల నీరు విడుదల

నదిలో నీరు తక్కువ ఉండడంతో జలవనరుల శాఖ అధికారులు పులిచింతల ప్రాజెక్టు నుంచి 4,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో స్నాన ఘాట్‌ల వద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా గజ ఈతగాళ్లు, పడవలను సిద్ధం చేశారు

నేటి రాత్రికి కల్యాణం

ముక్తేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం అర్ధరాత్రి 12 గంటలకు స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందు కోసం ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె నాగరాజు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు ప్రత్యేక స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు.

కోటిలింగాల ముస్తాబు

మహాశివరాత్రి ఉత్సవాలకు కోటిలింగ హరిహర మహాక్షేత్రం ముస్తాబైంది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇన్‌చార్జ్ ఈఓ నాగరాజు అన్ని ఏర్పాట్లు చేశారు. బాణవాయు శివలింగ ప్రతిష్టలకు సైతం సిద్ధం చేశారు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



పెనుగంచిప్రోలులోని అంభికేశ్వరస్వామి ఆలయం

విస్తృత పోలీస్ బందోబస్తు

ఉత్సవాల విజయవంతానికి సర్కిల్ పరిధిలో 200 మంది పోలీసులను ఏర్పాటు చేసినట్లు సీఐ నాగ మురళి తెలిపారు. 15 మంది ఎస్ఐలు, 150 మంది హోంగార్డులు, 50 మంది ఏఎస్, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ బందోబస్తులో ఉంటారని పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: నవరత్నాల్లో పొందుపర్చిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలన్నీ అర్హులందరికీ అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పరిటాలలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజలను అభివాదం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. తదుపరి గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, మన బడి నాడు-నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని పేదలకు ఆర్థికసాయం అందించడం, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. ఇటువంటి సీఎం తిరిగి మళ్లీ అధికారంలోకి రావాలని అందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ యద్దనపూడి ఆనందజ్యోత్స్న, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు మార్త శ్రీనివాసరావు, కర్ల రామకృష్ణ, యద్దనపూడి విజయారావు, జీవరాజు, కిషోర్, విజయ్, జాన్‌బాబు, జమలయ్య, నరసింహారావు, ఏసుబాబు, వేల్పుల శ్రీనివాసరావు, రమేష్, ఏపీఎం భాస్కరరావు పాల్గొన్నారు.



పరిటాలలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

వీరభద్ర స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

నందిగామ: పట్టణంలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలోని అంకమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. వీరభద్ర స్వామిని, భద్రకాళి అమ్మవార్లను పెండ్లి కొడుకు, పెండ్లి కూతురును చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతియేటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాణంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయాన్ని, పరసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ్యంగా ఆలయం వద్ద ఏర్పాటుచేసిన 50 అడుగుల విద్యుత్ దీపాల ప్రభ చూపరులను ఆకట్టుకుంటుంది.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి



జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండలం, సుబ్బాయి గూడెం గ్రామానికి చెందిన వడ్లమూడి గోపీచంద్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి(ఎల్ఓసీ) ద్వారా మంజూరైన రూ.4 లక్షలను లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు అందజేశారు. సుబ్బాయి గూడెం సర్పంచ్ వెంకటేశ్వరరావు, నాయకుడు బెజవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు అందిస్తున్న తీరుపై కళాజాత

కంచికచర్ల: మండలంలోని పరిటాల గ్రామంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సీఈఓ శ్యామ్ మనోహర్ సౌజన్యంతో శుక్రవారం బిళ్లపాడు కళాకారుల బృందం ప్రచార రథంతో కళాజాత నిర్వహించారు. కంచికచర్ల కేడీసీసీ బ్యాంకు మేనేజర్ గీతాభారతి మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంకు రైతులకు ఎన్నో వ్యవసాయ రుణాలు అందిస్తోందన్నారు. కేడీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

జగ్గయ్యపేట అర్బన్: క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. కోవిడ్ సమయంలో పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రామిశెట్టి సాయి కోవిడ్‌తో మృతిచెందాడు. అతని మిత్రులు రామ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రామిశెట్టి సాయి సంగమేష్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌కు సంబంధించి శుక్రవారం జరిగే లీగ్ మ్యాచ్‌ను సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్‌తో మృతి చెందిన స్నేహితుని పేరు మీద ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, మైనార్టీసెల్ అధ్యక్షుడు మొహిద్దీన్, నాయకులు జంగాల వాసు, క్రికెట్ కోచ్ రాజేంద్ర, రామిశెట్టి సాయి సంగమేష్ మెమోరియల్ సభ్యులు పాల్గొన్నారు.



లీగ్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

అమ్రితసాయిలో ప్రాంగణ ఎంపికలు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో చైన్నయ్‌కు చెందిన ప్రముఖ కంపెనీ సుందరం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ రామ్మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. టీవీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో భాగమైన సుందర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ప్రతిభ కనపర్చిన 22మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. ఎంపికైన వారి వార్షిక వేతనం రూ.2-4లక్షలు నిర్ణయించి నియమాక పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్, ప్లేస్‌మెంట్ అధికారి చిరంజీవి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల నమ్మకం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల నమ్మకమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ఆర్ఎస్ గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి నందిగామ పట్టణ గృహ సారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే గృహ సారథులను నియమించినట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా గృహ సారథులు పని చేయాలన్నారు.

సగర్వంగా ప్రజల ముందుకు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల ముందుకు సగర్వంగా వెళ్తున్నామని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వ పాలనలో కూడా ఎన్నికలకు ఏడాదిన్నర ముందుగా ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి 'మేం ఇది చేశాం మాకు అండగా ఉండండి' అని అడిగిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను నమ్ముకున్నారని, వారి కోసం ఏమైనా చేసే మనస్తత్వం ఆయనది అని తెలిపారు.

వై నాట్ 175..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వై నాట్ 175' నినాదంతో ముందుకు సాగుతున్నారని గృహ సారథులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అందుకనుగుణంగా పని చేయాలని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాలకు 100 శాతం వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా ప్రతిఒక్కరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఆర్టీసీ రీజియన్ చైర్‌పర్సన్ పద్మావతి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్లు నాగరత్నం, లక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, నాయకులు సాంబశివరావు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

కంచికచర్ల: శనగపంట సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని నందిగామ సహాయ వ్యవసాయ సంచాలకులు ధర్మపురి రమణమూర్తి అన్నారు. మండలంలోని పేరకలపాడు, కంచికచర్ల, వీరులపాడు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచికచర్ల మండలంలో 6,440 ఎకరాలు, వీరులపాడు మండలంలో 1,707 ఎకరాలు మొత్తం 8,147 ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారన్నారు. త్వరలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా శనగలను కొనుగోలు చేయు నిమిత్తం రైతులు తప్పనిసరిగా శనగపంట వివరాలు ఈకేవైసీని రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్‌లో ఈకేవైసీ చేయని రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులు మాత్రమే సీఎం యాప్‌లో రిజిస్టర్ చేయించుకోవడానికి అర్హత ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు తప్పనిసరిగా, రైతు హాజరుతో ఫొటో, ఈకేవైసీ ద్వారా సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఓ ప్రసాద్ పాల్గొన్నారు.

వీరులపాడు: రైతులు తప్పనిసరిగా తమ పంటలకు సంబంధించి ఈకేవైసీ నమోదు చేయించేకోవాలని ఏడీఏ రమణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాలలో జరుగుతున్న ఈకేవైసీ నమోదు తీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బోడవాడ గ్రామంలో 1,707 ఎకరాలు, కంచికచర్ల మండలంలో 6,440 ఎకరాల శనగ పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.



పేరకలపాడు ఆర్బీకేలో ఈకేవైసీ తీరును పరిశీలిస్తున్న ఏడీఏ రమణమూర్తి

విద్య, వసతి కల్పించేందుకే సీజనల్ హాస్టళ్లు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే కూలీల పిల్లలకు విద్య, వసతి కల్పించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం మునగాలపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలస కుటుంబాల విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కాకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే విద్యార్థులు బడి మానేయకుండా వారి చదువులు కొనసాగించేలా హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ హాస్టల్లో మూడు పూటలా ఆహారంతో పాటు వసతి కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అనంతరం హాస్టల్లోని విద్యార్థులు, నిర్వహణ, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వేల్పుల ఏశమ్మ, ఎంఈఓ బాలాజీ, గ్రామ నాయకుడు పెద్దబ్బాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీజనల్ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

భూముల రీ సర్వే ప్రారంభం

లింగగూడెం(పెనుగంచిప్రోలు): జగనన్న భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన భూముల రీసర్వే శుక్రవారం గ్రామంలో చేపట్టారు. పథకానికి సంబంధించి ఏర్పాటు చేసిన డ్రోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు బరిగెల వెంకట్రామయ్య మాట్లాడుతూ భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఈసర్వే పనులను ఇత ర రాష్ట్రాల వారు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. ఉపసర్పంచ్ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు నాగరాజు, నాయకులు ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, గ్రామ సర్వేయర్ గోపి, సర్వే ఆఫ్ ఇండియా సర్వేయర్ శశిభూషణ్‌రావు పాల్గొన్నారు.

అనవసర ఖర్చులు తగ్గించుకోవాలి

కంచికచర్ల : ప్రతిఒక్కరూ ప్రతి నెల కుటుంబంలోని ఆదాయ, వ్యయాలను సమీక్షించుకుని ఆర్థిక ప్రణాళికను రూపొందించుకుని అనవసరపు ఖర్చులు తగ్గించుకోవటం వల్ల పొదుపు సాధ్యపడుతుందని ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాల జిల్లా సమన్వయకర్త శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేములపల్లిలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సదస్సు నిర్వహించారు.